# 'జన నాయగన్' లీక్ వివాదం..

# సెన్సార్ బోర్డు క్లారిటీ, లీక్ వార్తలు నిరాధారం



దళపతి విజయ్ నటించిన జన నాయగన్ సినిమా రిలీజ్‌కు ముందే ఆన్‌లైన్‌లో లీక్ అయిందన్న వార్తలు సినీ ఇండస్ట్రీలో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేయగా.. తాజాగా సీబీఎఫ్‌సీ అధికారికంగా స్పందిస్తూ కీలక ప్రకటన విడుదల చేసింది. సెన్సార్ బోర్డు ప్రకారం.. 'జన నాయగన్' మూవీ లీక్ అయ్యిందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. తమ వద్ద ఉన్న భద్రతా వ్యవస్థలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని తెలిపింది. ముఖ్యంగా సినిమా కంటెంట్‌ను రక్షించేందుకు కీ డెలివరీ మెసేజ్ (ఖణవీ) సిస్టమ్‌ను ఉపయోగిస్తున్నామని వివరించింది. ఈ విధానం ద్వారా సినిమా కాపీకి యాక్సెస్ పూర్తిగా పాస్‌వర్డ్ ఆధారంగా ఉండటంతో అనధికారికంగా లీక్ అయ్యే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని పేర్కొంది. అలాగే, సినిమా డిజిటల్ సినిమా ప్యాకేజీ (ఐజూ) మార్చి 17న ముంబైలో అధికారికంగా నిర్మాతకు అందజేసినట్లు వెల్లడించింది. ఆ తరువాత నుంచి ఆ కంటెంట్ పూర్తిగా నిర్మాత ఆధీనంలోనే ఉందని సీబీఎఫ్‌సీ స్పష్టం చేసింది. మరోవైపు, సినిమా లీక్ అంశంపై చిత్ర నిర్మాణ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ కొనసాగుతోంది. సోషల్ మీడియాలో లింకులు షేర్ చేసిన ఐదుగురిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసినట్లు సమాచారం. వైరల్ అవుతున్న వీడియోల్లో కనిపించిన వాటర్‌మార్క్ ఆధారంగా లీక్ ఎక్కడి నుంచి జరిగిందనే దానిపై దర్యాప్తు జరుగుతోంది.

చిత్ర బృందం కూడా ఈ విషయంపై కఠినంగా స్పందిస్తూ.. లీక్ అయిన కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేయడం, షేర్ చేయడం, చూడడం కాపీరైట్ చట్టాల ప్రకారం నేరమని హెచ్చరించింది. ఇప్పటికే పలు లింకులను తొలగించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో, ఈ సినిమా సెన్సార్ క్లియరెన్స్ విషయంలో కూడా ఆలస్యం జరుగుతోంది. మొదట సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ చిత్రం, సెన్సార్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో వాయిదా పడింది. ప్రస్తుతం రివైజింగ్ కమిటీ పరిశీలనకు వెళ్లిన ఈ సినిమా క్లియరెన్స్ ఎప్పుడు వస్తుందన్నది ఇంకా అనిశ్చితంగానే ఉంది. ఈ ఘటనపై కోలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ పలువురు సినీ ప్రముఖులు స్పందిస్తూ.. పైరసీకి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. సినిమాలను థియేటర్లలోనే చూడాలని, పైరసీని ప్రోత్సహించవద్దని అభిమానులను కోరుతున్నారు.

## 'ధురంధర్ 2' నుంచి 'డెస్టినీ -- మన్ అత్కేయా' ఫుల్ వీడియో సాంగ్ విడుదల

ప్రముఖ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు దాదాపు రూ.1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలోని 'డెస్టినీ -- మన్ అత్కేయా' అనే పాటకు సంబంధించిన ఫుల్ వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. శాశ్వత్ సచ్‌దేవ్ స్వరపరిచిన ఈ గీతం ఆధునిక ర్యాప్ మరియు సాంప్రదాయ సూఫీ సంగీతాల అద్భుత కలయికగా నిలిచింది. వైభవ్ గుప్తా, షాజాద్ అలీ, మరియు టోకెన్ తమ గాత్రంతో ఈ పాటకు ప్రాణం పోశారు. ముఖ్యంగా అండర్ కవర్ ఏజెంట్‌గా రణవీర్ సింగ్ పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు స్ఫూర్తినిచ్చే లిరిక్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.




# భారతీయ సంగీత ధ్రువతార

# ఆశా భోస్లే కన్నుమూత..

### ఆమెతో జరిపిన సంభాషణలు ఎప్పటికీ గుర్తుంచుకుంటా: మోదీ



భారతీయ సంగీత ప్రపంచంలో మరో ధ్రువతార అస్తమించింది. తన మధుర గాత్రంతో దశాబ్దాల పాటు కోట్లాది సంగీతాభిమానులను అలరించిన లెజెండరీ గాయని ఆశా భోస్లే (92) ఏప్రిల్ 12, 2026న ముంబైలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె, ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. గుండెపోటు, బహుళ అవయవాల వైఫల్యం ఆమె మరణానికి కారణమని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఆమె మృతిపై దేశవ్యాప్తంగా తీవ్ర విషాదం వ్యక్తమవుతోంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ తన సంతాప సందేశంలో ఆశా భోస్లేను భారతదేశపు అత్యంత బహుముఖ గాయనీమణులలో ఒకరుగా కొనియాడారు. ఆమె స్వరం కాలాతీతమైనది.

భారతీయ సంస్కృతికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయాలు అంటూ ఆయన నివాళులర్పించారు. సోషల్ మీడియా ద్వారా ఆమెతో ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటూ సానుభూతి తెలిపారు .ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె స్వరం ప్రజల జీవితాల్లో నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది అంటూ పలువురు ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. ఇక 1933లో మంగేష్కర్ కుటుంబంలో జన్మించిన ఆశా భోస్లే, చిన్న వయస్సులోనే సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు నిరంతరాయంగా సాగిన ఆమె గాన ప్రయాణం భారతీయ సంగీత చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచింది. 20కి పైగా భాషల్లో 12 వేలకుపైగా పాటలు పాడి, ప్రపంచంలోనే అత్యధిక పాటలు రికార్డ్ చేసిన గాయనిగా గుర్తింపు పొందారు.

ఆమె గాన వైవిధ్యం అసాధారణం. మెలోడీ పాటలు, ఉత్సాహభరితమైన డ్యాన్స్ నంబర్స్, గజల్స్, భజనలు ఏ జానర్ అయినా ఆమె స్వరంలో ప్రత్యేక మాధుర్యం కనిపించేది. ముఖ్యంగా ఉమ్రావ్ జాన్, ఇజాజత్ వంటి చిత్రాల్లో ఆమె ఆలపించిన గజల్స్ సంగీత ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి. ఆమె సోదరి, గానకోకిల లతా మంగేష్కర్ తర్వాత భారతీయ సంగీత సామ్రాజ్యంలో అదే స్థాయి గౌరవాన్ని పొందిన గాయని ఆశా భోస్లే. సంగీత రంగానికి చేసిన అపార సేవలకు గాను భారత ప్రభుత్వం ఆమెను 'పద్మ విభూషణ్', 'దాదాసాహెబ్ ఫాల్కే' వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలతో సత్కరించింది. అలాగే రెండు జాతీయ అవార్డులు, ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఆమె మరణంతో టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాదు.. అంతర్జాతీయ సంగీత ప్రపంచం కూడా శోకసంద్రంలో మునిగిపోయింది. పలువురు సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, అభిమానులు సోషల్ మీడియాలో ఆమె పాటలను గుర్తుచేసుకుంటూ నివాళులర్పిస్తున్నారు.

## నాపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవం!.. పోలీసులకు మంగ్లీ ఫిర్యాదు

### డబ్బులు ఇవ్వలేదనే సుబ్బారావు తప్పుడు కథనాలు



హైదరాబాద్, ఏప్రిల్ 12 న్యాయవాది సుబ్బారావు తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని, కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని సింగర్ మంగ్లీ ఆరోపించారు. మైక్రోఫైనాన్స్ పేరుతో మంగ్లీ, ఆమె సోదరుడు, అతడి స్నేహితులు తన క్లయింట్ల ను కోట్లాది రూపాయలు మోసం చేశారని న్యాయవాది సుబ్బారావు పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై వ స్తున్న ఆరోపణలను ఖండిస్తూ మంగ్లీ ఆదివారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను రూ.150కోట్ల మోసానికి పా ల్పడినట్టు న్యాయవాది సుబ్బారావు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తనతో దు రుసుగా మాట్లాడటమే కాకుండా డబ్బు లు డిమాండ్ చేశారని, అవి ఇవ్వనందుకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు.తనకు సంబంధం లేని కరెన్సీనోట్ల వీ డియోలను వైరల్ చేస్తూ తనను మానసిక వేదనకు గురిచేస్తున్నాడని వాపోయారు. 14 ఏండ్ల నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకు సాగుతున్నానని, ఒక బంజా రా ఆడబిడ్డనైన తనను కావాలనే బద్‌నాం చేస్తున్నారని అన్నారు. తన పేరు చెప్పుకొని ఎవరో వసూలు చేస్తే దానికి తాను ఏమీ చేయాలని, తనకు ఎలా తెలుస్తుందని, తానేమైనా రోబోనా..? అని ప్రశ్నించారు. నిత్యం ప్రోగ్రామ్‌లతో బిజీగా ఉండటం వల్ల బయటకు రాలేకపోయానని పేర్కొన్నారు. తన పేరును వాడుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కోకాపేటలో స్కూల్, పబ్ ఎక్కడుందో తనకు తెలియదని, ఆ బిజినెస్ మైండ్ తనకు లేదని తెలిపారు.బాలాజీ నాయక్, మధునాయక్ దందా చాలా రోజుల నుంచి నడుస్తున్నదని, ప్రస్తుతం ఆ కేసు సీఐడీ పరిధిలో ఉన్నదని పేర్కొన్నారు. ఈ విషయంలో నష్టపోయిన బాధితులకు తాను అండగా నిలబడుతానని స్పష్టంచేశారు. సినిమాల మీద మక్కువతో తన పేరును సుబ్బారావు వాడుకోవాలని చూస్తున్నాడని, మీడియాకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడని తెలిపారు. తాను ఈ కేసులో ఉన్నట్టు నిర్ధారణ అయితే ఎక్కడికి రావడానికైనా సిద్ధమని స్పష్టంచేశారు.

## యోధుడిగా అరవింద్ కృష్ణ..

### కర్మస్థలం నయా లుక్ వైరల్



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ అరవింద్ కృష్ణ. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన ఈ టాలెంటెడ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న మరో చిత్రం కర్మ స్థలం . రాకీ షెర్మాన్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాయ్ ఫిల్మ్స్ సమర్పణలో రాకీ షెర్మాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ మూవీ నుంచి మేకర్స్ నయా పోస్టర్ విడుదల చేశారు.తాజాగా అరవింద్ కృష్ణ రోల్‌కు సంబంధించిన లుక్ రిలీజ్ చేయగా.. ఇందులో ఓ యోధుడిగా కనిపించబోతున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్.ఇప్పటివరకు షేర్ చేసిన పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఒక్కో పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ రేకెత్తిస్తోంది. ఈ మూవీలో చుంకీపాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి. కాలకేయ ప్రభాకర్, వెంకటేశ్ ముమ్మిడి, వినోద్, బలగం సంజయ్, దిల్ రమేశ్, నాగ మహేశ్, వినోద్ అల్వ, మిథాలీ చౌహాన్, కిల్లి క్రాంతి ఇతక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నాడు. ఈ మూవీకి విజువల్స్‌తోపాటు బీజీఎం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలువబోతున్నట్టు తాజా లుక్ హింట్ ఇచ్చేస్తుంది.

## దమ్ మారో దమ్.. కిక్కెక్కించిన ఆశా భోంస్లే.. వీడియో



ముంబై: ప్రఖ్యాత గాయని ఆశా భోంస్లే ఇవాళ కన్నుమూశారు. ఆ సింగర్ పాడిన దమ్ మారో దమ్ సాంగ్ ఓ సూపర్‌హిట్. హిప్ కల్చర్‌ను ప్రజెంట్ చేసిన సాంగ్ అది. ఆ రోజుల్లో ఈ పాట ఓ బంపర్ హిట్. డ్రగ్ కల్చర్‌ను.. ఆ నాటికి తగ్గ రీతిలో ఈ ఫిల్మ్‌లో చూపించారు. 1971లో రిలీజైన హరే కృష్ణ హరే రామ్ చిత్రంలో ఓ సన్నివేశంలో దమ్ మారో దమ్ సాంగ్ వస్తుంది. జీనత్ అమన్ పాత్ర ఈ సాంగ్ పాడుతుంది. ఆర్డీ బర్మన్ అందించిన సంగీతం ఓ హైలెట్. పాశ్చాత్య సంప్రదాయం వైపు మొగ్గ చూపుతున్న యువతను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో ఆ సాంగ్ సీక్వెన్స్‌ను రూపొందించారు. వాస్తవానికి ఫిల్మ్‌లో ఈ పాట ముందు అనుకోలేదు. కానీ డ్రగ్ సీన్‌ను క్రియేట్ చేసే సమయంలో దాన్ని మరింత ఎఫెక్ట్‌గా ప్రజెంట్ చేయాలనుకున్నారు. ఆ సమయంలో రైటర్ ఆనంద్ భక్షీ రాసిన కొన్ని పదాలు సంగీత దర్శకుడు ఆర్డీ బర్మన్‌ను ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత ఈ పాట కట్టేశారు.

ఆ నాటి హిప్పీ కల్చర్‌లో ఉన్న మజాను.. సింగర్ ఆశా భోంస్లే తన వాయిస్‌లో వినిపించారు. మత్తులో చిత్తై తూగుతున్నట్లుగా ఆమె తన స్వరాన్ని పలికించారు. డ్రగ్ బానిసల భావోద్వేగాన్ని ఆశా భోంస్లే తన వాయిస్ రూపంలో అత్యద్భుతంగా ఒలికించారు. నేపాల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాటను షూట్ చేశారు. సినిమాను రిలీజ్ చేస్తున్న సమయంలో ఓ దశలో నిర్మాత దేవానంద్ ఈ పాటను సినిమా నుంచి తీసివేయాలనుకున్నారు. కానీ ఈ సాంగ్ హిట్ అవుతుందని ఆశా భోంస్లే చెప్పడం వల్లే దాన్ని ఫిల్మ్‌లో క్యారీ చేసినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు.బాలీవుడ్‌తో పాటు యావత్ ఫిల్మ్ ఇండస్ట్రీనే ఈ సాంగ్ కిక్కెక్కించిందనడంలో సందేహం లేదు. దమ్ మారో దమ్.. అంటూనే హరే కృష్ణ హరే రామ్ అన్న పదాలను వాడడం పట్ల విమర్శలు వచ్చినా.. మ్యూజిక్ టీమ్ అనుకున్నట్లుగు ఈ సాంగ్ ఫుల్ పాపులర్ అయ్యింది. కానీ ఆల్ ఇండియా రేడియోతో పాటు దూరదర్శన్‌లోనూ ఈ పాటపై బ్యాన్ విధించారు. హరే కృష్ణ హరే రామ్ చిత్రాన్ని దూరదర్శన్‌లో ప్రదర్శించిన ప్రతిసారి ఈ పాటను కట్ చేశారు. తాజాగా రిలీజైన సూపర్‌హిట్ మూవీ ధురంధర్2లో ఈసాంగ్‌ను ఓ సీన్‌లో సౌండ్‌ట్రాక్‌గా వాడారు. సోషల్ మీడియాలోనూ ఈ ట్రాక్ ఊపేస్తోంది.

## డగౌట్‌లో సెల్‌ఫోన్‌తో.. వివాదంలో రాయల్స్ మేనేజర్ బిందర్



న్యూఢిల్లీ: రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి బిందర్ వివాదంలో చిక్కుకున్నాడు. ఆర్‌సీబీతో గత శుక్రవారం మ్యాచ్ సందర్భంగా బిందర్ డగౌట్‌లో ఫోన్‌తో కనిపించాడు. ప్లేయర్స్ అండ్ మ్యాచ్ ఆఫీషియల్స్ ఏరియా(పీఎమ్‌వోఏ) ప్రొటోకాల్ ప్రకారం డగౌట్‌లో ఫోన్లు ఎవరూ ఉపయోగించేందుకు వీలులేదు. అలాంటిది సూర్యవంశీతో ఉన్న బిందర్ సెల్‌ఫోన్‌లో ఏదో చూపిస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పీఎమ్‌వోఏ ప్రొటోకాల్ అనుసరించి టీమ్ మేనేజర్ డ్రెస్సింగ్‌రూమ్‌లో ఫోన్ వాడేందుకు అవకాశముంటుంది, కానీ డగౌట్‌లో అది నిషేధమని బీసీసీఐ అధికారి స్పష్టం చేశారు.

## జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు సహస్ర ఎంపిక




ఇనుగుర్తి, ఏప్రిల్ 12 : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని బొల్లు సహస్ర ఎంపికైంది. దీనికి సంబంధించిన వివరాలను ఎంఈవో రూపారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇనుగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సహస్ర ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వరంగల్ తరఫున ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నీలో రాష్ట్రం నుంచి సహస్ర పాల్గొంటున్నట్లు రూపారాణి తెలిపారు. సహస్రను పాఠశాల పీడీ తాళ్ల ప్రణయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## అమన్, ముకుల్ వెండి పట్టు



బిష్కెక్: ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్లు అమన్ సెహ్రావత్, ముకుల్ దహియా రజత పతకాలతో మెరిశారు. ఆదివారం జరిగిన పురుషుల 61కిలోల కేటగిరీ ఫైనల్లో అమన్ 10-13తో క్వాంగ్ ముయాంగ్ కిమ్(కొరియా) చేతిలో పోరాడి ఓడాడు.మరోవైపు పురుషుల 86కిలోల తుది పోరులో ముకుల్ 0-7తో కమ్రాన్ జీ గసెమ్‌పౌర్(ఇరాన్)పై ఓటమిపాలయ్యాడు.

## అనంత్ అంబానీ బర్త్ డే వేడుకలు.. భార్య గౌరీతో కలిసి చిందేసిన షారుఖ్



జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ 31వ పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన భజన సంధ్యలో బాలీవుడ్ అగ్ర తారలు సందడి చేశారు. ప్రముఖ గాయకుడు కైలాష్ ఖేర్ తన అద్భుతమైన గాత్రంతో "బమ్ లహరి" పాటను పాడుతుండగా, బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ మరియు ఎనర్జిటిక్ స్టార్ రణవీర్ సింగ్ భక్తి పారవశ్యంలో మునిగిపోయి డ్యాన్స్ చేశారు. ముఖ్యంగా షారుఖ్ ఖాన్ తన భార్య గౌరీ ఖాన్‌తో కలిసి ఎంతో క్లాసీగా స్టెప్పులు వేయడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. నలుపు రంగు దుస్తుల్లో షారుఖ్, గ్రే కలర్ సూట్‌లో గౌరీ ఖాన్ జంటగా డ్యాన్స్ చేస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ కార్యక్రమంలో కేవలం భజనలే కాకుండా, సాంప్రదాయ గర్బా డ్యాన్స్ కూడా హైలైట్‌గా నిలిచింది. నటి జాన్వీ కపూర్ మరియు రణవీర్ సింగ్ కలిసి గర్బా ఆడి వేడుకలో మరింత ఉత్సాహాన్ని నింపారు. సల్మాన్ ఖాన్, అనన్యా పాండే వంటి ఇతర ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొని అనంత్ అంబానీకి శుభాకాంక్షలు తెలిపారు.

# గుజరాత్‌కు రెండో విజయం..



### లక్నో గడ్డపై దంచేసిన గిల్, బట్లర్..

పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ వరసగా రెండో విజయం సాధించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) త్వరగా ఔటైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను సులువుగా ఎదుర్కొన్న జోస్ బట్లర్(60), గిల్ గుజరాత్‌ను గెలుపు దిశగా నడిపారు. రెండో వికెట్‌కు అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయం వెంటవెంటనే ఔటైనా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. ఏడు వికెట్లతో గెలుపొందిన గుజరాత్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

సొంత మైదానంలో పంజా విసరాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్(రూా+)కు భారీ షాకిచ్చింది గుజరాత్ టైటాన్స్. తొలుత ప్రసిధ్ కృష్ణ() సంచలన స్పెల్‌తో లక్నోను 164కే కట్టడి చేసిన గుజరాత్ మోస్తరు లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) విఫలమైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వని గిల్.. జోస్ బట్లర్(60) స్కోర్ బోర్డును ఉరికించారు. గిల్ కళాత్మక షాట్లతో అలరించగా.. బట్లర్ స్కూప్, రివర్స్ స్వీప్ షాట్లతో చెలరేగాడు. రెండో వికెట్‌కు 84 పరుగులు జోడించిన గిల్‌ను ప్రిన్స్ యాదవ్ వెనక్కి పంపాడు. కాసేపటికే షమీ ఓవర్లో బట్లర్ సిక్సర్‌కు యత్నించి బౌండరీ వద్ద మర్క్‌రమ్ స్టన్నింగ్ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్)తో కలిసి రాహుల్ తెవాటియా(10 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వలేదు. ప్రిన్స్ ఓవర్లో 4, 6 బాదిన సుందర్ లాంఛనం పూర్తి చేశాడు. దాంతో.. వరసగా సన్‌రైజర్స్, కోల్‌కతాపై గెలుపొందిన లక్నోకు ఓటమి తప్పలేదు.



### ప్రసిధ్ దెబ్బకు విలవిల

పంతొమ్మిదో సీజన్‌లో హ్యాట్రిక్ కొట్టాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్ మోస్తర్ స్కోర్‌కే పరిమితమైంది. సొంత మైదానంలో చెలరేగిపోవాలనుకున్న లక్నో జట్టుకు గుజరాత్ టైటన్స్ పేసర్ ప్రసిధ్ కృష్ణ(4-28) షాకిచ్చాడు. పవర్ ప్లేలోనే కగిసో రబడ(1-54), ప్రసిధ్ ధాటికి రెండు వికెట్లు కోల్పోయిన లక్నో ఏ దశలోనూ పుంజుకోలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన గుజరాత్ పేసర్లు లక్నో హిట్టర్లకు బ్యాట్ ఝుళిపించే అవకాశమివ్వలేదు.

ప్రసిధ్ కృష్ణ(4-28)

ప్రసిధ్ ధాటికి 69కే మూడు వికెట్లు పడిన వేళ పవర్ హిట్టర్ ఆయుశ్ బదొని(9), నికోలస్ పూరన్(19)లు లక్నోను ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, ఈ ఇద్దరి సైతం వెనక్కి పంపిన ప్రసిధ్ స్కోర్ వేగానికి బ్రేకులు వేశాడు. కుర్రాళ్లు అబ్దుల్ సమద్(18), ముకుల్ చౌదరీ(18) మెరవగా.. ఆఖర్లో ఇంప్యాక్ట్ సబ్ జార్జ్ లిండే(16)ధనాధన్ ఆడడంతో ఆ జట్టు 160 పరుగులు చేయగలిగింది. ఆఖరి ఓవర్లో షమీ(12 నాటౌట్) సిక్సర్ బాదడంతో లక్నో 8 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేయగలిగింది.

## రోయింగ్‌లో తెలంగాణ పతక జోరు

కటక్(ఒడిశా) వేదికగా జరిగిన ఆల్‌ఇండియా ఇండోర్ రోయింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రోయర్లు పతక జోరు కనబరిచారు. నాలుగు రోజుల పాటు జరిగిన టోర్నీలో రెండు స్వర్ణాలు సహా మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలతోమెరిశారు.

అండర్-15 బాలికల పెయిర్‌లో వర్షిత, ధాత్రి, లావణ్య, దేవేంద్రమ్మతో కూడిన తెలంగాణ పసిడి సొంతం చేసుకుంది. అండర్-15 బాలుర పెయిర్‌లో యశ్వంత్, సాయితేజ రజతం దక్కించుకున్నారు. బాలుర రిలేలో యశ్వంత్, సాయితేజ వెండి పతకం దక్కించుకున్నారు.




# ఆర్‌సీబీ ధనాధన్.. సాల్ట్, కోహ్లీ, పటిదార్ వీర విహారం

### ముంబైపై బెంగుళూరు అద్భుత విజయం

**ఆర్‌సీబీ ధనాధన్.. సాల్ట్, కోహ్లీ, పటిదార్ వీర విహారం డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అదరగొట్టింది. ఆదివారం వాంఖడే వేదికగా జరిగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై అద్భుత విజయం సాధించింది.**

ముంబై: డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అదరగొట్టింది. ఆదివారం వాంఖడే వేదికగా జరిగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై అద్భుత విజయం సాధించింది. ప్రముఖ సింగర్ ఆశా భోంస్లేకు ఘన నివాళులు అర్పించిన ఇరు జట్ల ప్లేయర్లు నల్లరిబ్బన్లు ధరించి మ్యాచ్ బరిలో దిగారు. టాస్ గెలిచిన ముంబై..ఆర్‌సీబీని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. వరుస మ్యాచ్‌ల్లో విఫలమవుతున్న ఫిల్ సాల్ట్(36 బంతుల్లో 78, 6ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగగా, విరాట్ కోహ్లీ(38 బంతుల్లో 50, 5ఫోర్లు, సిక్స్), రజత్ పటిదార్(20 బంతుల్లో 53, 4ఫోర్లు, 5సిక్స్‌లు) అర్ధసెంచరీలతో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 240/4 స్కోరు చేసింది. ముంబైపై ముంబైలో ఆర్‌సీబీకి ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. లక్ష్యఛేదనలో ముంబై 20 ఓవర్లలో 222/5 స్కోరు చేసింది. రూథర్‌ఫర్డ్(31 బంతుల్లో 71 నాటౌట్, ఫోర్, 9సిక్స్‌లు)ఒంటరిపోరాటం చేశాడు.

### సాల్ట్ విజృంభణ..

బౌల్ట్ బౌలింగ్‌లో డీప్ స్వేర్ లెగ్‌లో కోహ్లీ కండ్లు చెదిరే రీతిలో సిక్స్‌తో ఖాతా తెరువగా, తానేం తక్కువ కాదన్నట్లు సాల్ట్ కూడా జత కలువడంతో పరుగుల వరద మొదలైంది. ముఖ్యంగా సాంట్నర్ వేసిన ఐదో ఓవర్‌లో సాల్ట్ హ్యాట్రిక్ సిక్స్‌లకు తోడు ఫోర్‌తో 22 పరుగులు పిండుకున్నాడు. ఇక లాభం లేదనుకుని బుమ్రాను దించగా ఆరు పరుగులు వచ్చినా పవర్‌ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా 71 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన మయాంక్‌ను హ్యాట్రిక్ ఫోర్లకు తోడు సిక్స్‌తో సాల్ట్ మరోమారు చెలరేగి 25 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని శార్దుల్ విడదీయడంతో తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. సాల్ట్ ఔటైనా..కోహ్లీ, పటిదార్ అదే దూకుడు కొనసాగించారు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లు బౌండరీలు బాదడంతో వాంఖడే స్టేడియం హోరెత్తిపోయింది.



### రూథర్‌ఫర్డ్ పోరాడినా:

భారీ లక్ష్యఛేదనలో ముంబైకి రోహిత్‌శర్మ(19) రిటైర్డ్‌హర్ట్ రూపంలో ఎదురుదెబ్బ తగిలింది.మిడిలార్డర్‌లో సూర్యకుమార్(33), హార్దిక్(40) ఆకట్టుకున్నా.. లాభం లేకపోయింది. ఆఖర్లో రూథర్‌ఫర్డ్..ఆర్‌సీబీ బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటూ ఏకంగా తొమ్మిది సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. సహచరుల సహకారం లేకపోయినా రూథర్‌ఫర్డ్ పోరాటం ఆకట్టుకుంది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 240/ 4(సాల్ట్ 78, పటిదార్ 53, శార్దుల్ 1/32, హార్దిక్ 1/39),

ముంబై: 20 ఓవర్లలో 222/5(రూథర్‌ఫర్డ్ 71 నాటౌట్, హార్దిక్ 40, సుయాశ్ 2/47, రసిక్ 1/23).

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609